ప్రజాశక్తి

శనివారం 15 జులై 2023

8 పేజీలు





విశాఖపట్నం

అనకాపల్లి

సాహితీ నిర్లక్ష్యంతోనే ఆరుగురు బలి

◆ ప్రమాద నియంత్రణ వ్యవస్థ లేమి ◆ అర్హత లేని సేఫ్టీ సూపర్‌వైజర్

◆ విచారణ కమిటీ ప్రాథమిక నిర్ధారణ ◆ లోపాలను ముందే చెప్పిన 'ప్రజాశక్తి'

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో అచ్యుతాపురం డి నోటిఫై ప్రాంతంలోని సాహితీ ఫార్మా యాజమాన్యం నిర్లక్ష్యం ఆరుగురి ప్రాణాలను బలిగొంది. నియంత్రిత వ్యవస్థలు పనిచేయకపోవడం, ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ తరహా ప్రమాదాలు చోటుచేసుకుంటాయని 'ప్రజాశక్తి' లేవనెత్తిన పలు అంశాలు నిజమని నేడు తేలింది. సాల్వెంట్ శుద్ధి క్రమంలో జూన్ 30న జరిగిన ఈ ప్రమాదంపై జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలోని అధికారుల బృందం తమ విచారణలో యాజమాన్య తప్పిదాలను ప్రాథమికంగా గుర్తించింది. దీంతో ఫార్మా ఉత్పత్తి ప్రక్రియను నిషేధిస్తూ ఈ నెల 10న ఉత్తర్వులు జారీచేశారు. ఉష్ణోగ్రతల ఒత్తిడికి వాక్యూమ్ దెబ్బతినకుండా హెచ్చు తగ్గుల నియంత్రణకు అధునాతన ఆటోమేటిక్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.. కానీ నియంత్రిత వ్యవస్థను యాజమాన్యం ఏర్పాటుచేయలేదు. ఇదిలేని కారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలకు వాక్యూమ్ దెబ్బతినడంతో ఒక్కసారిగా భారీ మంటలు వ్యాపించినట్లు విచారణ కమిటీ ప్రాథమిక నిర్ధారణకు వచ్చింది. ఇంకా ఫోరెన్సిక్ నివేదిక రావాల్సివుంది. ప్రమాదం జరగకుండా నియంత్రిత వ్యవస్థ ఏర్పాటు చేయలేదని గుర్తించిన కమిటీ ప్రమాదం జరిగిన తరువాత తీవ్రత పెరగకుండా పనిచేయాల్సిన ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఎలా ఉన్నాయనేది పరిశీలిస్తోంది. ఈ తరహా కోణం నుంచి పరిశీలన పూర్తిచేసి వారం రోజుల్లో తుది నివేదికను కలెక్టర్ రవి పట్టాన్ శెట్టికి ఇవ్వనుంది.

సేఫ్టీ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించే వ్యక్తి బిఎస్‌సి కెమిస్ట్రీ పూర్తిచేసి, ఐదేళ్ల అనుభవం కలిగి ఉండాలి. కానీ సేఫ్టీ సూపర్‌వైజర్‌గా పనిచేసి ప్రమాదంలో చనిపోయిన రామేశ్వర్ బికాం చదివినట్లు గుర్తించారు. చనిపోయిన మరో ఐదుగురు పదో తరగతి, ఐటిఐ చదివినట్లు తెలుస్తోంది. ప్రమాదకర ప్రదేశంలో తక్కువ జీతాలకు పనిచేసేలా విద్యార్హతలు లేనివారిని యాజమాన్యం పెట్టుకున్నట్లు విచారణ కమిటీ గుర్తించింది.



సాహితీ ఫార్మాలో జరిగిన పేలుడులో గాయపడి మృతిచెందిన కార్మికులు (ఫైల్‌ఫోటో)

అసైన్డ్ భూముల బదలాయింపు చట్టంతో మేలు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో 1954లో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను వారికే బధలాయించేలా చట్టం చేసి సిఎం జగన్మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షలా 21 వేలా 160 మంది పేదలకు 27 లక్షలా 41 వేలా 698 ఎకరాల భూమి అమ్ముకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలకు, పేదలకు సంబంధించి శ్మశానాలు చిన్నవి అయిపోతున్నాయని చాలా సందర్భాల్లో ప్రజల నుంచి వచ్చిన స్పందన వినతుల దృష్ట్యా సమస్య పరిష్కారానికి సిఎం చొరవ చూపారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శ్మశానాలు ఎక్కడెక్కడ అవసరమో మిగతా 2లో..



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

రైల్వే పార్కులో ప్రవేశ రుసుం తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఎస్ఎ పార్క్ (రైల్వే పార్క్)లో వాకింగ్ చెయ్యడానికి ప్రవేశ రుసుము వసూలు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతికి వినతిపత్రం సమర్పించారు. పార్కులో ప్రవేశ రుసుం రూ.50 నుంచి రూ.100కి పెంచారన్నారు. వాస్తవానికి గతంలో రూ.50ని ప్రవేశ రుసుంగా నిర్ణయించినా అమలు చేయలేదన్నారు.

తాజాగా రూ.100గా నిర్ణయించి అమలు చెయ్యడానికి గేట్లు మూసేశారన్నారు. రైల్వే ప్రజలు చెల్లించే ఛార్జీలతో నడుస్తోందని, ఈ నేపథ్యంలో రైల్వే ఆస్తులు ప్రజల ఆస్తులని అన్నారు.

పెందుర్తి జనసేనలో లొల్లి !

▶ వార్త 3లో..

చంద్రయాన్ - 3 విజయవంతంపై హర్షం

▶ వార్త 4లో..

గంగవరం పోర్టు కార్మికులకు విశాల మద్దతు

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్‌పై అదానీ పెత్తనమేంటి ?

దిగుమతులకు ఆటంకం కలిగించడం దారుణం

సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ 1100 ఎకరాల భూములను గంగవరం పోర్టు నిర్మాణం కోసం నాడు ఇచ్చిందని, ఆ భూములలో నిర్మించిన పోర్టుపై అదానీ పెత్తనం ఏమిటని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన సరుకులను లోడింగ్, అన్ లోడింగ్‌కు చేసేందుకు పోర్టు ఎంతగానో ఉపయోగపడుతుందని భావించి భూములను నాడు కేటాయించినట్టు తెలిపారు. అనంతరం గంగవరం పోర్టు అదానీ పరమైందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును గంగవరం పోర్టులో పాత బకాయిలున్న నెపంతో అన్‌లోడ్ చేయనీకుండా అదానీ గంగవరం పోర్టు అడ్డుకోవడం దారుణమన్నారు. ఒక పక్క మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా, ముడిసరుకు సరఫరా చేయకుండా, ఆర్థిక వనరులు కేటాయించకుండా అడ్డుపడుతూ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం ప్రైవేట్‌పరం చేయాలని పూనుకుందని గుర్తుచేశారు. దీనికి వ్యతిరేకంగా 883 రోజుల నుంచి కార్మికవర్గం, ప్రజలు పోరాడుతున్నా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

గంగవరం పోర్టులో స్టీల్‌ప్లాంట్‌పై అదానీ పెత్తనం పూర్తిగా మోడీ, కేంద్ర ప్రభుత్వ ఆజ్ఞలతోనే జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా తీరుమార్చుకుని స్టీల్‌ప్లాంట్‌కు రావలసిన ముడిసరుకును యధావిధిగా దిగుమతులు చేసుకోనివ్వాలని, లేనిపక్షంలో జరిగే పరిణామాలకు అదానీ పోర్టు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలుసుకోవాలన్నారు.

వెయ్యి ఎకరాలలో టాయ్ పార్క్

◆ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్

◆ గ్లోబల్ ఈ-కామర్స్‌లో అడుగుపెట్టిన పల్స్ ప్లష్ ◆ ఘనంగా ప్రారంభ వేడుక

ప్రజాశక్తి - గాజువాక : రాష్ట్రంలో వెయ్యి ఎకరాలలో టాయ్ పార్క్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు వచ్చాయని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సంప్రదించి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాక గ్రీన్ సిటీలో ఉన్న పల్స్ ప్లష్ బొమ్మల కంపెనీ డిస్నీ, వాల్‌మార్ట్, టెస్కో, హాస్బ్రో, స్పిన్ మాస్టర్ తదితర వ్యాపార సంస్థల ద్వారా న్యూయార్క్, ఫ్లోరిడా, శాన్ ఫ్రాన్సిస్కోతో పాటు యుఎస్‌లోని మరిన్ని నగరాలకు తమ బొమ్మలను ఎగుమతులు చేసేందుకు వీలుగా గ్లోబల్ ఈ-కామర్స్‌ను శుక్రవారం మంత్రి అమర్‌నాథ్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను శ్రీ సిటీలో పర్యటించినప్పుడు దేశంలో బొమ్మల మార్కెట్‌కు ఉన్న ప్రాధాన్యత ఏమిటో తెలిసిందని, దేశవ్యాప్తంగా ఏడాదికి 7 నుంచి 8 లక్షల కోట్ల రూపాయల విలువైన బొమ్మల విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. బొమ్మల తయారీలో చైనా అగ్రస్థానంలో ఉందని, త్వరలోనే మిగతా 2లో..



బొమ్మలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

మొదటి పేజీ తరువాయి..

వెయ్యి ఎకరాలలో టాయ్ పార్క్

ఆంధ్రప్రదేశ్ టాయ్స్ ఎక్స్‌పోర్ట్స్ హబ్‌గా మారనుందని తెలిపారు. ఎపిలో టాయ్ పార్క్ ఏర్పాటు చేయడం వల్ల 30 నుంచి 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పల్స్ ఫ్లష్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ అజయ్ సిన్హా మాట్లాడుతూ బొమ్మలు తయారీపై తనకు మక్కువ ఎక్కువని, సుమారు 30 సంవత్సరాల నుంచి తాను ఈ రంగంలో దేశ, విదేశాల్లోని అనేక సంస్థలలో కీలక బాధ్యతలు పోషించానని చెప్పారు. 1995లో నోయిడాలో బొమ్మలను తయారు చేశామని, అప్పట్లో దేశంలో డిస్నీ లైసెన్స్ తన సంస్థకు మాత్రమే ఉండేదని తెలిపారు. 1997 నుంచి 2000 సంవత్సరం వరకూ తమ సంస్థ తయారుచేసిన బొమ్మలను తైవాన్, సౌత్ కొరియా తదితర దేశాలకు ఎగుమతి చేశామని చెప్పారు. నాణ్యతతో కూడిన బొమ్మలను తయారుచేయాలన్నదే తన లక్ష్యమని, అయితే ఆ సమయంలో ముడి సరుకు సమస్య ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా నాణ్యమైన బొమ్మల తయారీలో వెనుకడుగు వేయకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగామన్నారు. 2011-12 మధ్య తిరుపతి దగ్గర ఉన్న శ్రీ సిటీలో పల్స్ ఫ్లష్ బొమ్మల తయారీకి శ్రీకారం చుట్టానని చెప్పారు. శ్రీ సిటీలో కేవలం ఐదు ఎకరాల్లో ఏర్పాటు చేసిన పరిశ్రమలో ఎగుమతులకు అనువైన బొమ్మల తయారు చేస్తున్నామని అజయ్ సిన్హా తెలియజేశారు. ఆ తర్వాత కాకినాడలో 300 ఎకరాల్లో పల్స్ ఫ్లష్ బొమ్మల తయారీ పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు పెద్ద ఎత్తున రావడంతో తమ కార్యకలాపాలను విశాఖపట్నం, నగరికి మార్చుకున్నామని చెప్పారు. విశాఖలో ప్రస్తుతం నడుస్తున్న తమ కంపెనీని మరింతగా విస్తరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాల కోసం ఎదురు చూస్తున్నామని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం విశాఖలో తయారవుతున్న బొమ్మలను విదేశాలలో ఉన్న చిన్నారులకు గ్లోబల్ ఈ-కామర్స్‌లోని డిస్నీ, వాల్‌మార్ట్, టెస్కో, హాస్బ్రో, స్పిన్ మాస్టర్ తదితర వ్యాపార సంస్థల ద్వారా చేరవేయనున్నామన్నారు.

అసైన్డ్ భూముల బదలాయింపు చట్టంతో మేలు

గుర్తించి అక్కడ ప్రభుత్వ స్థలం ఉంటే ప్రభుత్వ స్థలం, లేకుంటే ప్రైవేట్ స్థలం కొని జిల్లా కలెక్టర్ ద్వారా ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని అన్నారు..

సందడిగా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకూ తలపెట్టిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో శుక్రవారమూ సందడిగా సాగింది. దేశం నలుమూలల నుంచి వచ్చిన నేత కార్మికులు వేలాది రకాల సిల్క్, కాటన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజులు, కుర్తీలు వగైరాలను విక్రయానికి పెట్టారు.



డిజైన్లను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

అన్నింటినీ ఒకేచోట 50 శాతం వరకు తగ్గింపు ధరలకే ఇస్తుండటంతో ఈ ఎక్స్‌పోకు వందలాదిగా ప్రజలు తరలివస్తున్నారు. నగరవాసులు వివాహ సందర్భాలు, పండగ సమయాలలో తళుక్కుమనేలా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో వస్త్రాలు ఒక ప్రత్యేక అనుభూతిని అందిస్తాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తమకు నచ్చిన వస్త్రాలను కొనుగోలు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రవేశం ఉచితమని, అన్ని రకాల కార్డుల చెల్లింపులు స్వీకరిస్తామని తెలిపారు. ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉంటుందన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్ష పదవి విల్లూరికి ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి జిల్లా అధ్యక్ష పదవిని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు ఇవ్వాలని ఆయన అనుచరులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వైసిపి యువజన విభాగం నగర అధ్యక్షునిగా రెండు పర్యాయాలు పనిచేసిన భాస్కరరావు కార్పొరేటర్‌గా వార్డులో అనేక అభివృద్ధి పనులు చేయించి మన్ననలు అందుకున్నారని తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికులకు విశాల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమకు న్యాయం చేయాలని కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికుల పోరాటానికి మద్దతుగా శుక్రవారం టిబి హాస్పిటల్ కార్మికులు సంఘీభావ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిబి హాస్పిటల్ కార్మికుల యూనియన్ నాయకులు పి.వెంకటరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. నోటీసులు రద్దు చేయాలన్నారు. పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిబి హాస్పిటల్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు



నినాదాలు చేస్తున్న టిబి హాస్పిటల్ కార్మికులు

పి.పోతురాజు, వి.కేశవ, మానసిక వైద్యశాల కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, పి.రాజు, గొల్లాజీ, సెక్యూరిటీ విభాగం నుంచి పి.కుమార్ పాల్గొన్నారు.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలోని ప్రతి మహిళను వ్యాపారవేత్తగా చేయడమే జగనన్న లక్ష్యమని తితిదే ఛైర్మన్, వైసిపి ఉమ్మడి విశాఖ సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో జివిఎంసి, మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలుత స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం జగన్ మహిళా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. అనంతరం మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, విఎంఆర్‌డిఎ ఛైర్‌పర్సన్ విజయనిర్మల, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, జివిఎంసి ప్రాజెక్ట్ డైరెక్టర్ పాపునాయుడు, వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మహిళా స్వయం సహాయక సంఘం సభ్యుల ఆర్థిక లబ్ధిపై మాట్లాడారు. కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు

రాజన్న ఆటోనగర్ నిర్మించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్క్రాప్ వర్కర్లకు ఆనందపురం మండలం కమనం గ్రామంలో కేటాయించిన స్థలంలో రాజన్న ఆటోనగర్ నిర్మించాలని స్క్రాప్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు



ధర్నా చేస్తున్న స్క్రాప్ వర్కర్లు

కె.గణేష్, నాయకులు విజయ్ డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్క్రాప్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్క్రాప్ వర్కర్లకు స్మార్ట్ సిటీ పేరుతో ఆనందపురం మండలం కమనం గ్రామం వద్ద 150 ఎకరాల 70 సెంట్లు భూమి కేటాయించారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దాన్ని రాజన్న ఆటోనగర్‌గా మార్చి నిధులు కేటాయించి, కట్టించి ఇస్తామని చెప్పి నాలుగేళ్లు దాటిందని, ఇంతవరకూ దానికి అతీగతీ లేకుండా పోయిందని అన్నారు. స్క్రాప్ వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ నాయకులు ఖాజావల్లి, సయ్యద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒక పక్క బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలను ఆదుకుంటామని చెప్పి, వారికి కేటాయించిన రాజన్న ఆటోనగర్‌ను నిర్మించకుండా కాగితాలకే పరిమితం చేయడం దారుణమన్నారు. సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, ఎం.సుబ్బారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు, స్క్రాప్ వర్కర్లు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జిఓ ప్రకారం పేద, బడుగు, బలహీన వర్గాల్లో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఉన్న వారి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం శుక్రవారం టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న రిజిస్టర్ కార్యాలయంలో చేపట్టారు. .దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలో ఉన్న వారికి రిజిస్ట్రేషన్ చేయడం పట్ల ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు హర్షం వెలిబుచ్చారు. రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులతో కలిసి లబ్ధిదారులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తలు భక్తి మంగరాజు, కంటిపిల్లి వరలక్ష్మి, మహంతి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

834వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 834వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కెవిపి.చంద్రమౌళి, ఇ.రాంబాబు, జె.శ్రీనివాస రావు, ఎన్.నారాయణ పాల్గొన్నారు.

పరిహారం మంజూరు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెండు నెలల క్రితం పాకిస్తాన్‌లోని కరాచీ జైలు నుంచి 198 మంది భారతీయ మత్స్యకారులు విడుదల కాగా వారిలో ఆంధ్ర మత్స్యకారులు ముగ్గురు ఉన్నారని, వారిని క్షేమంగా వారి కుటుంబాలకు అప్పగించామని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు చొప్పున పరిహారం మంజూరైందని శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆకట్టుకున్న 'ప్లాస్టిక్‌పై యుద్ధం'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే హానిని తెలియజెబుతూ జివిఎంసి ఆధ్వర్యంలో దండు నాగేశ్వరరావు రచనలో వేమలి త్రినాథ్ దర్శకత్వంలో రసజ్ఞ సాంస్కృతిక సంక్షేమ సంస్థ సమర్పణలో భీమిలి, తగరపువలస, సీతమ్మధార, హెచ్‌బి కాలనీల్లో ప్రదర్శించిన ప్లాస్టిక్‌పై యుద్ధం వీధి నాటిక ఆదరిణీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో మొహిద్దీన్, హేమ, డప్పు రమణ, ధనలక్ష్మి, పోలిరెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

11వ రోజుకు నిర్వాసిత కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల నిరసన దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరుకున్నాయి. సిఐటియు నాయకులు అప్పలరాజు దీక్షాశిబిరాన్ని సందర్శించి, మాట్లాడుతూ పోర్టు కార్మికుల సమస్య చాలా సున్నితమైనప్పటికీ పరిష్కారంలో యాజమాన్యం తాత్సారం చేయడం తగదన్నారు. సముద్రంపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు గంగవరం పోర్టు రాకతో జీవితాలు బాగుపడతాయని భావించారని, వారి ఆశలన్నీ తలకిందులు చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 11 రోజులుగా కుటుంబాలతో కార్మికులు దీక్షలు చేస్తున్నా,అదానీ యాజమాన్యం స్పందించకపోవడం దుర్మార్గమని,ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అ'పూర్వ' కలయిక



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక విజ్ఞాన్ చిట్టిచిట్టి స్కూల్, ప్రకృతి స్కూల్‌లో 2013-14 నుంచి 2022-23 వరకు పదేళ్ల పాటు చదువుకున్న పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా శుక్రవారం పాఠశాలలో కలుసుకున్నారు. చదువుకున్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ సరదాగా గడిపారు. ఒకరిని మరొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు

ట్రిపుల్ ఐటికి ఇద్దరు విద్యార్థుల ఎంపిక



బోర త్రిలోక్



వేదవేద్య కార్తీక్

ప్రజాశక్తి -తగరపువలస :నూజివీడు ట్రిపుల్ ఐటికి తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పొట్నూరు మురళీ మోహనరావు తెలిపారు. ట్రిపుల్ ఐటిలో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థులు బోర త్రిలోక్, కొట్యాడ వేదవేద్య కార్తీక్‌లు హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు

చట్టసభల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు



నియామకపత్రం అందుకుంటున్న సత్యలక్ష్మి

ప్రజాశక్తి-సీతమ్మధార :చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వర్లరావు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కంటుభుక్త సత్యలక్ష్మిని నియమిస్తూ, నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చట్టసభల్లో రిజర్వేషన్‌తోనే బిసిలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తారన్నారు. బిసి కులగణనకు ఎనిమిది అసెంబ్లీల్లో తీర్మానం చేసి, 16రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించినా కేంద్రం స్పందించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పెప్పిలి రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు. కాకర్ల రాజారావు., సిహెచ్.నాగేశ్వరరావు, మహిళా కన్వీనర్. ఆర్ కృష్ణవేణి, మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఆర్.ప్రసాద్, ఊర్వశి మహాలక్ష్మి, వెంకటలక్ష్మి, అప్పలరాజు, వెంకటరమణ, నజీమా బేగం, బి. పద్మ, చౌడుపల్లి దేవుడు పాల్గొన్నారు.

పెందుర్తి జనసేనలో లొల్లి!



అభిమానులు, అనుచరులతో సమావేశంలో పంచకర్ల(ఫైల్)

ప్రజాశక్తి-పెందుర్తి : వైసిపి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఆ పార్టీకి రాజీనామా చేయడం ఇక్కడ పెందుర్తి నియోజకవర్గం జనసేనలో లొల్లికి కారణమౌతోంది. అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒకటైన పెందుర్తి నియోజకవర్గం ఎపుడూ ప్రత్యేకతే. గతంలో ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడు, ద్రోణంరాజు సత్యనారాయణ, గుడివాడ గురునాథరావు, బండారు సత్యనారాయణమూర్తి వంటి ప్రముఖులు, సీనియర్ నేతలు ఇక్కడ నుంచే పోటీచేశారు. ప్రాతినిధ్యం వహించారుకూడా. సీనియర్ నేతలు ఇక్కడ నుంచి పోటీకి ఎంతో ఇష్టపడతారు. ఇటీవల జిల్లాల పునర్విభజన తర్వాత కూడా పెందుర్తి ప్రత్యేకత చాటుకుంది. విశాఖ, అనకాపల్లి రెండు జిల్లాల పరిధిలోకి ఈనియోజకవర్గం ఉండడం విశేషం.

అటువంటి పెందుర్తిలో అధికారపార్టీ నుంచి అదీప్‌రాజ్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉండగా, ప్రధాన ప్రతిపక్షం టిడిపికి సీనియర్ నేత, మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఉండనే ఉన్నారు. అలాగే జనసేన తరపున ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ కొన్నాళ్లుగా కేడర్‌కు అండగా ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని ముందుండి నడిపిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పొత్తుల్లో భాగంగా జనసేన, టిడిపి కలిసి పోటీచేస్తే అధిష్ఠానాల నిర్ణయం మేరకు ఏపార్టీకి కేటాయిస్తే, సంబంధిత నాయకుడు పోటీ బరిలో ఉంటారని ఇప్పటివరకు అందరూ అనుకుంటూ వచ్చారు. గత ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ 19వేల పైచిలుకు ఓట్లు రావడం, ఆ పార్టీకి ఇక్కడ ఎంత పట్టుందో స్పష్టమౌతోంది.

ఇదిలా ఉండగా, వైసిపికి పంచకర్ల గుడ్‌బై చెప్పడం, అనుచరులు, అభిమానులతో గురువారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించడమే ఇపుడు చర్చగా మారింది. పంచకర్ల ఏపార్టీలో చేరుతారు, ఎక్కడ నుంచి పోటీచేస్తారనే ప్రస్తావన రాగా, రెండు రోజుల్లో ప్రకటిస్తానని ఆయన అనగానే, జనసేన అంటూ అక్కడి కార్యకర్తలు నినాదాలు చేయడమే ఇపుడు చర్చకు కారణమైంది. పంచకర్ల జనసేన తీర్థం పుచ్చుకుని, ఆ పార్టీ తరపున అభ్యర్థిత్వం ఖరారైతే, ఉద్యోగం వదులుకుని, ఇన్నాళ్లు పార్టీ కోసం పనిచేసిన శివశంకర్ పరిస్థితి ఏంటనే చర్చ సాగుతోంది. పొత్తుల్లో భాగంగానైనా, లేకుంటే ఒంటరిగా పోటీ చేసినా, పెందుర్తిలో జనసేన అభ్యర్థిత్వాన్ని ఇన్నాళ్లు పార్టీకోసం శ్రమించిన శివశంకర్‌కు టిక్కెట్ ఇవ్వాలిందేనని, కొత్తగా వచ్చిన వారికి అవకాశం కల్పించాలని భావిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదంటూ అపుడే జనసైనికులు బాహటంగానే చెబుతున్నారు. ఎన్నికలకు మరికొద్ది నెలలే పరిస్థితుల్లో పెందుర్తిలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు అపుడే అక్కడ కాక పుట్టిస్తున్నాయని చెప్పకతప్పదు.

75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలి

కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : వలసలు నివారణకు రాష్ట్రంలో నెలకొల్పే ప్రభుత్వ, ప్రైవేటు సహ అన్ని పరిశ్రమల్లో 75శాతం ఉద్యోగాలను తప్పకుండా స్థానికులకే కేటాయించాలని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు డిమాండ్ చేశారు..పరిశ్రమలు సజావుగా నడవాలంటే స్థానికుల మద్దతు చాలా అవసరమన్నారు.

ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాలకు, ఉభయగోదావరి, దక్షిణకోస్తా జిల్లాల నుంచి విదేశాలకు వలసలు సర్వసాధారణంగా మారాయని,స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలను ఇతర ప్రాంతాల వారు ఎగరేసుకుపోవడం వల్లే ఈ దుస్థితి కారణమన్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి ప్రకారం ప్రాంతీయ, మండలాల ఉద్యోగాల్లో స్థానికులకు వెసులుబాటు కల్పించేలా అప్పటి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడితే, రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖను సంప్రదించిన మీదట జిఒ. 128 విడుదల చేసి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించిందన్నారు. ఉద్యోగాల్లో స్థానికులకు 75శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీనిచ్చిన ముఖ్యమంత్రి, దాని అమలులో తాత్సారం చేయడం సరికాదన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాయితీ

ప్రజాశక్తి -ఆనందపురం: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు నిరుద్యోగులకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుందని ఎపిఎఫ్‌పిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఎ.రహీం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిఎంఎఫ్ఎంఇ పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుపై ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పథకం వివరాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ, ఇతర ప్రయోజనాలను వివరించారు.సదస్సుకు 55 మంది హాజరు కాగా, వారిలో 12 మంది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సంధ్య, ఉద్యానవన అధికారి సోనీ, పశువైద్యాధికారి డాక్టర్ లీలారాణి, డిఆర్‌డిఎ ఎపి నాయుడు, డిపిఎం వైదేహి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారి రమేష్, డిఆర్‌పి ప్రతాప్‌కుమార్,ఎస్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో చిట్టివలస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : ఆర్థిక అక్షరాస్యత అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో చిట్టివలస జెడ్‌పి హైస్కూల్ టెన్త్ విద్యార్థి గంటా పవన్‌కుమార్, 9వ తరగతి విద్యార్థి జీరు వెంకట కీర్తన్ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికైన ఆరు జట్లలో చిట్టివలస కూడా ఉంది.

వీరంతా వచ్చే 23న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన చిట్టివలస విద్యార్థులు ఇరువురికి రూ.20 వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు హెచ్‌ఎం పొట్నూరు మురళీ మోహనరావు, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు నాగేశ్వరరావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు

ఎరుకలకు ఎస్‌టి కులధ్రువీకరణ ఇవ్వాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి నేతల అభ్యంతరంతో ఎరుకల కులస్తులకు ఎస్‌టి కులధ్రువీకరణలను ఇవ్వడానికి సచివాలయ అధికారులు నిరాకరించడం దుర్మార్గమని డివైఎఫ్ఐ, పౌరసంఘాల నేతలు ఆరోపించారు. 45వ వార్డు తాటిచెట్లపాలెంలో ఎరుకల కులస్తులు కుల ధ్రువీకరణకు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకుంటే సచివాలయ అధికారులు నిరాకరించడంతో సమస్య పరిష్కారానికి సచివాలయంలో అడ్మిన్‌ను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, పౌరసంఘం అధ్యక్షులు గౌరీష్, దుర్గ, దేముడు, కోటి తదితరులు కలిసి విన్నవించారు. వైసిప నేతలు ఇవ్వొద్దన్నందునే ఎరుకలకు ఎస్‌టి ధ్రువీకరణ జారీ చేయడం లేదని సచివాలయ సిబ్బంది చెప్పడం అన్యాయమని, రాజకీయ దురుద్దేశం తోనే ఇలాంటి చర్యలకు పాల్పడితే న్యాయం కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. అర్హులకు సంక్షేమ మంటూ, ఇలా నేతలు చెప్పారని పేదలకు కష్టాలు పాల్జేయడం అన్యాయమన్నారు.

నేరాలు ఘోరాలు

అల్లుపేటలో దారుణం

బాలుడిని హత్య చేసిన తల్లి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ప్రజాశక్తి-డెంకాడ : విశాఖ జిల్లా భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేటలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. బాలుడిని తల్లి హత్య చేసింది. బుధవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాలుడి తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...

భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ పరిధిలోని అల్లుపేటకు చెందిన బట్ట కొండమ్మ, బంగారయ్యకు ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి గణేష్(5), దినేష్ (3) కుమారులు ఉన్నారు. కొండమ్మకు 15 ఏళ్ల వయసులోనే వివాహమైంది. భార్యాభర్తలు నిత్యం గొడవలు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో పిల్లలతో కలిసి అదే గ్రామంలోని పుట్టింటికి కొండమ్మ వెళ్లిపోయింది. వారం కిందట గ్రామపెద్దలు ఇద్దరికి సర్దిచెప్పినా ప్రయోజనం లేకపోయింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు పిల్లలను పుట్టింటి నుంచి తీసుకుని బయటకు ఆమె వెళ్లిపోయింది. తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు పరిసరాల్లో గాలించారు. గ్రామంలో టీ దుకాణం సమీపంలో గురువారం ఉదయం కొండమ్మ కనిపించింది. చిన్నకుమారుడు కనిపించక పోవడంతో ఆమెను ప్రశ్నించారు. గోతిలో పడి చనిపోయినట్లు చెప్పింది. అల్లుపేట సమీపంలో ఉన్న మండలంలోని మోదవలస రెవెన్యూ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశంలో దినేష్ విగతజీవిగా పడి ఉన్నాడు. బాలుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి, భర్త బంగారయ్యకు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. తమ్ముడిని అమ్మ పీక నులిపేసిందని పెద్ద కుమారుడు చెప్పాడని భీమిలి పోలీస్‌స్టేషన్‌లో బంగారయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. ఈ సంఘటనా స్థలం డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉందని గురువారం రాత్రి కేసును ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో కొండమ్మను డెంకాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయనగరం రెండో పట్టణ సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ మహేష్.. ఆమెను విచారించారు. ఆమె తొలుత పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేసింది. చివరికి గొంతునులిమి హత్య చేసినట్లు అంగీకరించింది. చిన్నకుమారుడు దినేష్ తండ్రికి దగ్గరగా, ఆప్యాయతగా ఉండటంతో ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీల నిధులను జమ చేయాలి

ప్రజాశక్తి-పద్మనాభం : కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేసిన 14,15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించి కాజేయడం దుర్మార్గమని మండలంలోని అనంతవరం సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్ సంఘం ఉపాధ్యక్షురాలు గొర్రిపాటి వెంకటలక్ష్మి ఆరోపించారు. 2019-2022లో ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రంలోని 12918 గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం రూ. 8660 కోట్లను విడుదల చేస్తే, సర్పంచ్‌ల అనుమతి లేకుండా సొంత పథకాలను దారి మళ్లించారని, దీని వల్ల గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాక, అభివృద్ధి జరగక పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ..2010కోట్లు, 2023-24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రావాల్సిన రూ.2020 కోట్లుతోపాటు గతంలో దారి మళ్లించిన నిధులన్నీ కలుపుకుని మొత్తంగా రూ.12,690 కోట్లు వెంటనే సర్పంచుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్పంచులు, ఎంపిటిసిలకు నెలకు రూ.15 వేలు గౌరవవేతనం ఇవ్వాలని, వాలంటీర్లను పంచాయతీల అధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తీర్మానం చేసిందని, అమలుకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : రెండో వార్డు వలందపేటలో రూ.ఏడు లక్షల జివిఎంసి నిధుల చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు వైసిపి వార్డు ఇన్‌ఛార్జి ఎస్ సరళారాణి శుక్ర వారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎస్ వంశీరెడ్డి, కె వెంకటరావు, కె శ్రీనివాసరెడ్డి, ఎస్ రాంబాబు, సిహెచ్ ప్రమీల, పద్మ పాల్గొన్నారు

చంద్రయాన్-3 విజయంపై సర్వత్రా హర్షం!

భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మొదటి దశ విజయవంతంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. ప్రపంచంలోని పలు దేశాలు చంద్రుని ఉత్తర ధృవంపై పరిశోధనలు చేపట్టగా, భారత్ మాత్రం జాబిలికి రెండోవైపు, సూర్యరశ్మి సోకని దక్షిణ ధృవంలో అంతరాలపై లోతుగా పరిశోధనకు పూనుకుంది. చంద్రయాన్-2 చివరి దశలో జాబిలిపై రోవర్ ల్యాండింగ్‌లో విఫలమైనప్పటికీ, పట్టుదలతో మలిప్రయోగం చేపట్టి, శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఎల్‌విఎం-3 ఎం4 ఉపగ్రహ వాహక నౌకతో రాకెట్‌ను ప్రయోగించి, భూకక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. 24రోజులపాటు భూకక్ష్యలోనే చంద్రయాన్-3 ప్రదక్షిణ అనంతరం వచ్చేనెల 23, లేదా 24 తేదీల్లో చంద్రుని దక్షిణ ధ్రువంపై, 70డిగ్రీల అక్షాంశంలో అడుగిడి అక్కడ అధ్యయనం చేయనుంది. తొలిదశలా కాకుండా చంద్రయాన్ -3 ప్రయోగంలో రోవర్, ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవంపై సాఫ్ట్‌గా ల్యాండింగ్ అయి, పరిశోధనలను విజయవంతంగా పూర్తిచేయడం ద్వారా భారత్ సత్తాను విశ్వవిఖ్యాతం కావాలి. చంద్రయాన్-3 విజయవంతంపై మేథావులతోపాటు భావితరం విద్యార్థుల అభిప్రాయాలివి.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

ఇస్రో చంద్రయాన్ రూపకల్పనలో కొత్తకోట యువ శాస్త్రవేత్త


అడ్డూరి రామచంద్రరావు

ప్రజాశక్తి -కొత్తకోట : ఇస్రో సారధ్యంలో శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతంతో రావికమతం మండలం కొత్తకోటలో సంబరాలు మిన్నంటాయి. ఈ అద్భుత ప్రాజెక్ట్ చంద్రయాన్-3 ప్రయోగ రూపకల్పనలో కొత్తకోట గ్రామానికి చెందిన యువ శాస్త్రవేత్త అడ్డూరి రామచంద్రరావు పాలుపంచు కోవడంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. భారతదేశ ప్రతిష్ట పెంచే ప్రయోగాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. అంతరిక్ష ప్రయోగాలలో రికార్డు స్థాయి విజయాలతో ప్రపంచానికి భారత్ సత్తా చూపడం హర్షణీయమని పలువురు కొనియాడారు.

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి హర్షం



చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంపై అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అంతరిక్ష చరిత్రలో భారత పతాకం రెపరెపలాడిందన్నారు. ఈ ప్రయోగంలో పని చేసిన శాస్త్రవేత్తలకు పేరుపేరునా అభినందనలు తెలిపారు.

ఇస్రో శాస్త్రవేత్తల కృషి గొప్పది



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ -3 విజయవంతం కావడంలో శాస్త్రవేత్తల కృషి అనన్య సామాన్యం. ముందుగా వారికి అభినందనలు. భారతదేశ కీర్తి ప్రతిష్టలను శాస్త్రవేత్తలు ఇనుమడింపజేశారనడంలో అతిశయోక్తి లేదు

పొట్నూరు మురళీ మోహనరావు
హెచ్ఎం, జెడ్‌పిహెచ్‌ఎస్, చిట్టివలస



కలెక్టరేట్ సిబ్బంది హర్షాతిరేకాలు

అనకాపల్లి : చంద్రయాన్ విజయవంతంపై కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జయహో చంద్రయాన్, జై భారత్, జై హింద్ అంటూ నినాదాలు చేశారు.



ఇనుమడించిన భారత్ ప్రతిష్ట



చంద్రుడిపై అధ్యయనానికి ఇస్రో చేపట్టిన మూడో మిషన్ చంద్రయాన్-3 ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన, భారీ ప్రయోగం. నాలుగేళ్ల కిందట ప్రయోగించిన చంద్రయాన్ -2 చివరి నిమిషంలో విఫలంగా కాగా, నాటి తప్పిదాలు పునరావృతం కాకుండా ఇస్రో శాస్త్రవేత్తలు లోపాలను సవరించి ఈసారి మరింత రెట్టించిన ఉత్సాహంతో చంద్రయాన్-3ను చేపట్టారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ప్రపంచంలోనే భారతదేశం ప్రతిష్ట మరింత ఇనుమడించింది.

బి.శేషగిరిరావు, ప్రాజెక్టు ఇంజనీర్,
డైట్ ఇంజనీరింగ్ కళాశాల అనకాపల్లి.

ఆనందానికి అవధుల్లేవు



చంద్రయాన్-3 విజయవంతంతో భారత్ కీర్తిపతాక విశ్వవ్యాప్తమైంది. ఇప్పటికే ఎన్నో ఉపగ్రహాలు విజయవంతం కాగా, వాటికి మించి చంద్రయాన్ -3 విజయం ఆనందంగా ఉంది.

ఈగల దివ్య, టెన్త్ విద్యార్థిని,
జెడ్‌పిహెచ్‌ఎస్,
తాటితూరు, భీమిలి మండలం

చంద్రునిపై పరిశోధన వేగవంతం



చంద్రుడు ఉపరితలంపై స్థితిగతులను లోతుగా అధ్యయనానికి చంద్రయాన్ -3 ప్రయోగం దోహదపడుతుంది. భవిష్యత్తులో చంద్రునిపై పరిశోధనలు మరింత వేగవంత మౌతాయి. ఈ ప్రయోగం ద్వారా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన అద్భుతంతో ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయి. చంద్రయాన్-3 విజయ వంతంలో శ్రమించిన శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.

పాడి కవిత, సైన్సు విద్యార్థిని, ఎయు

సంతోషంగా ఉంది



చంద్రునిపై నీటి సాంద్రత తెలుసుకోవడానికి, మానవాళి నడవడికకు కావాల్సిన సదుపాయాలను గుర్తించి, భావితరాలకు సంక్లిష్టంగా ఉన్న విషయాలనూ తెలిపేందుకు ఉపయోగపడే 'చంద్రయాన్ 3' విజయవంతం కావడం సంతోషంగా ఉంది. ఈ విజయంతో భారత్ ఖ్యాతి మరింత పెరుగుతుంది.

బెహరా గీతాంజలి, సైన్సు విద్యార్థిని,
ఆంధ్ర విశ్వవిద్యాలయం

గర్వించదగ్గ విషయం



ఇంత వరకూ అమెరికా, రష్యా, చైనాలు మాత్రమే చంద్రుడి ఉపరితలంపై విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేశాయి. చంద్రయాన్-3 దక్షిణ ధ్రువం వద్ద విజయ వంతంగా దిగడంతో ఆ ఘనత సాధించిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. అంతేకాదు, చంద్రుడిపై సాఫ్ట్ ల్యాండింగ్‌ను సాధించిన నాలుగో దేశంగా గుర్తింపు పొందింది. ఎల్‌ఎంవి-ఎం4 చంద్రయాన్-3ను నింగిలోకి తీసుకెళ్లడం నిజంగా భారతీయులుగా గర్వించదగ్గ విషయం.

- భాగ్యశ్రీ, ఈసీఈ విద్యార్థిని.
డైట్ ఇంజనీరింగ్ కళాశాల అనకాపల్లి.

గర్వంగా ఉంది



అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రవేత్తల అపారమైన విజ్ఞానం వెరశి చంద్రయాన్-3 విజయం. చంద్రుని దక్షిణ ధృవంపై పరిశోధనల్లో తొలిమెట్టు జయప్రదం కావడం గర్వంగా ఉంది.

బత్తుల వాసవి,
టెన్త్ విద్యార్థిని జెడ్‌పిహెచ్‌ఎస్,
తాటితూరు, భీమిలి మండలం

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన



చంద్రయాన్-3 విజయవంతానికి కృషి చేసి ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు. ఈ ప్రయోగంతో పరిశోధనా రంగంలో భారత్ ఒక ముందడుగు వేసింది. చంద్రునిపై ఉన్న వనరుల అన్వేషణ, వాటి వినియోగానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచానికి చంద్రయాన్-3 మార్గనిర్దేశం కానుంది.

ఎం.రాజబాబు, హెచ్ఎం,
జెడ్‌పిహెచ్‌ఎస్, చంద్రంపాలెం

సత్తాచాటిన భారత్



చంద్రయాన్-3 విజయంతో ప్రపంచానికి తన సత్తాను చూపిన భారత్, తాము ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు. తొలిదశలో విఫలమైనా, రెట్టింపు ఉత్సాహంతో ప్రయోగం చేసి ఇస్రో శాస్త్రవేత్తల కృషి, పట్టుదల అభినందనీయం.

కె.జ్యోతి, టెన్త్ విద్యార్థిని,
జెడ్‌పిహెచ్‌ఎస్, చంద్రంపాలెం

రెపరెపలాడుతోన్న భారత్ కీర్తిపతాక



చంద్రయాన్-3 విజయంతో భారతదేశ కీర్తి పతాక విశ్వవ్యాప్తంగా రెపరెపలాడుతోంది. పలు ప్రయోగాలతో సత్తా చాటిన ఇస్రో శాస్త్రవేత్తలు, చంద్రునిపై ప్రయోగంలోనూ విజయవంతం కావాలి.

జి. హర్షిత్, టెన్త్ విద్యార్థి,
జెడ్‌పిహెచ్‌ఎస్, చంద్రంపాలెం

భారత్ ఎందులోనూ తక్కువ కాదు



భారతదేశం ఎందులోనూ తక్కువ కాదని చంద్రయాన్ -3 విజయవంతంతో మరోసారి నిరూపితమైంది. శాస్త్రవేత్తల కృషి వేనోళ్ళ కొనియాడబడుతోంది.

టివిఎస్‌వి ప్రసాదరావు, టీచర్,
జెడ్‌పిహెచ్‌ఎస్, తాటితూరు, భీమిలి

శాస్త్రవేత్తల కృషి ఫలించింది



చంద్రయాన్-3 ద్వారా చంద్రునిపై పరిశోధనలు చేసి, భావితరాలకు శాస్త్రసాంకేతిక విజ్ఞానాన్ని, సమాచారాన్ని అందించేందుకు ఇస్రో శాస్త్రవేత్తల చేసిన కృషి, ఈ ప్రయోగం విజయవంతంతో ఫలించింది.

పి. సుస్మిత, టెన్త్ విద్యార్థిని,
జెడ్‌పిహెచ్‌ఎస్, చంద్రంపాలెం

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని వినతి



డిఎంహెచ్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఆశ యూనియన్ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి

ఆశా వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ హేమంత్‌కు ఆశ వర్కర్స్ యూనియన్ శుక్రవారం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతి మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్ ఫోన్లు, 4జి సిమ్స్ ఇవ్వాలని, ఆన్లైన్ వర్క్ శిక్షణ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ వర్కుల పేరుతో జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు వెంటనే ఆపాలన్నారు. 14 రకాల యాప్లను డౌన్లోడ్ చేసుకోవాలని, వాటి నుంచే పనిచెయ్యాలని, 26 రకాల రికార్డులు రాయాలని ప్రభుత్వం హుకుం జారీ చేసిందని, సెల్ఫోన్స్ పనిచేయకపోతే సొంతంగా కొనుగోలు చేసుకొని పనిచేయాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రికార్డులు కూడా సొంత డబ్బులతో కొనుగోలు చేయాలని, లేకుంటే వేతనాలు కట్ చేస్తామని, ఉద్యోగం నుండి తొలగిస్తామని అధికారులు బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. పై డిమాండ్లపై జరుగు ఆందోళనలో ఆశ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం సూర్య కళ, పి సూర్య కుమారి, కె ఆదిలక్ష్మి, సిహెచ్ నాగలక్ష్మి, సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో సిటి స్కాన్‌ను అందుబాటులోకి తేవాలి

అనకాపల్లి : స్థానిక ఎన్.టి.ఆర్. వైద్యాలయంలో ఏళ్ల తరబడి సి.టి. స్కాన్ మరమ్మతులకు గురైందని, తక్షణమే రిపేర్ చేసి అందుబాటులోకి తేవాలని కోరుతూ శుక్రవారం ప్రజా ఆరోగ్య వేదిక అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ హేమంత్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు బి. ఉమామహేశ్వరరావు, కొణతాల త్రినాథ్, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ వైద్యాలయంగా ఉన్న ఈ ఆసుపత్రిలో కనీస అవసరమైన సిటి స్కానింగ్ లేకపోవడంతో పేద, సామాన్య ప్రజలు తమకు అవసరమైన స్కానింగ్ నిమిత్తం ప్రైవేటు ల్యాబ్లకు వెళ్లి డబ్బు ఖర్చు పెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణీలకు, ఇతర రోగులకు సిటి స్కాన్ ఎంతో అవసరమని, ఏళ్ల తరబడి పనిచేయకుండా ఉండడం అత్యంత దురదృష్టకరమన్నారు. తక్షనమే అధికారులు స్పందించి సి.టి.స్కాన్ను రిపేరు చేయించాలని కోరారు. జిల్లా మంత్రి అమర్నాథ్ ,స్థానిక ఎంపీ సత్యవతి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : డెంగీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి ఏఎంసీ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పద్మిని పేర్కొన్నారు. డెంగ్యూ నివారణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వాతావరణం మారుతున్న నేపథ్యంలో ఎవరికైనా జ్వరం తదితర ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు వరలక్ష్మి, పార్వతి, ల్యాబ్ టెక్నీషియన్ రాజేశ్వరి, డేటా ఎంట్రీ ఆపరేటర్ శిరీష, ఫార్మసిస్టు దేవి, ఎల్ జి ఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసంపై శిక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో రైతులకు పశుగ్రాసాలపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ బి.ప్రసాద్ రావు మాట్లాడుతూ పాడి రైతులు పశువులకు పశు దానాలతో పాటు పశుగ్రాసాలను కూడా ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. దీని ద్వారా అధిక లాభం పొందవచ్చున్నారు. వివిధ రకాల పశుగ్రాసాలపై, గడ్డి విత్తనాలపై పాడి రైతులందరికీ అవగాహన కల్పించారు. పాడి రైతులు 1962 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పశువైద్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. సబ్సిడీపై పశుదానాలు, గడ్డి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ భానుబాబు, పాడి రైతులు పాల్గొన్నారు.

బావి చుట్టూ కంచె ఏర్పాటు పనుల అడ్డగింత

నేతవానిపాలెంలో ఘర్షణ వాతావరణం



ఘర్షణ పడుతున్న వైస్ ఎంపిపి అనుచరులు

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో శుక్రవారం వివాదాస్పదంగా ఉన్న బావి చుట్టూ ఎమ్మెల్యే ధర్మశ్రీ ఆదేశాల మేరకు బుచ్చయ్యపేట పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కంచె ఏర్పాటు పనులు చేపట్టగా, వైస్ ఎంపీపీ గొంప వెంకటేశ్వరరాజు, అతని అనుచరులు అడ్డుకున్నారు. పనులు చేపట్టడానికి నేతవానిపాలెం గ్రామ పెద్దలను పంచాయతీ కార్యదర్శి పిలవడంతో శుక్రవారం లచ్చన్న బావి వద్దకు నేతవానిపాలెం గ్రామస్తులు, పెద్దలు వెళ్లారు. పనులు చేపట్టవద్దని వైస్ ఎంపీపీ అతని వర్గీయులు అడ్డుకున్నారు. పరస్పరం ఇరువర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి గందరగోళంగా మారింది. సమాచారం అందుకున్న బుచ్చయ్యపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

శుక్రవారం దిబ్బడి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన వైసిపి నాయకుడు జెర్రిపోతుల అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శించడానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రాగా, నేతవానిపాలెం గ్రామస్తులు ఆయన్ను కలిశారు. బావి చుట్టూ కంచె ఏర్పాటు పనులను అడ్డుకుంటున్నారని గ్రామానికి చెందిన వియ్యపు మాణిక్యం, వియ్యపు రాజు, బర్నికాడ దేవుళ్ళు, వియ్యపు పైడినాయుడు, మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

జిఒ 22ను ఉపసంహరించుకోవాలి

ఎపి ప్రైవేటు డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణాజీ



మాట్లాడుతున్న రమణాజీ

ప్రజాశక్తి-చోడవరం

ప్రైవేటు డిగ్రీ కళాశాలలను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 22ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల రమణాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిగ్రీ ప్రైవేట్ కళాశాలలో బంద్ పాటించినట్లు తెలిపారు. శుక్రవారం చోడవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో నెంబర్ 22 ప్రకారం ఏపీహెచ్ ఆర్ఎంసి నిర్ణయించిన ఫీజులతో ప్రైవేటు కాలేజీలు నడపడం కష్టమన్నారు. బీఎస్సీ, బీకాం వంటి కోర్సులకు 2017లో యూనివర్సిటీలు నిర్ణయించగా ప్రస్తుతం అదే కోర్సులకు జీవో ప్రకారం ప్రభుత్వం రూ.15000 నిర్ణయించడం బాధాకరమన్నారు. పెరిగిన యాజమాన్యాల నిర్వహణకు అనుగుణంగా కనీసం ఫీజు రూ.25వేలు ఉండాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏడాదికి ఒక్కొక్క విద్యార్థికి ప్రభుత్వం రూ.98 వేలు ఖర్చు చేస్తుందని, దానిలో నాలుగో వంతు చొప్పున పెంచామని కోరుతున్నామని చెప్పారు. ప్రైవేటు కళాశాలలకు ఫీజులను నిర్ణయించే అధికారం యూనివర్సిటీలకే తప్ప ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏపీ హెచ్ఆర్ఎంసికి లేదన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఈనెల 18న అమరావతిలోని ఏపీహెచ్ఆర్ కార్యాలయం ధర్నా చేపడతామని హెచ్చరించారు. న్యాయ పోరాటానికి కూడా సిద్ధమవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 270 ప్రైవేటు కళాశాలలకు ఫీజులు తీసుకోవడానికి ప్రభుత్వం అనుమతించలేదని, వెంటనే వాటికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు.



బంద్‌లో భాగంగా అయ్యన్న కళాశాల వద్ద నిరసన

ఫీజుల నిర్ణయంపై పున:పరిశీలన చేయాలి : ఖాసీం

కె.కోటపాడు : ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజ్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎపిహెచ్ఇఅర్ అండ్ ఎంసి) నిర్ణయించిన డిగ్రీ కోర్సుల ఫీజులకు సంబంధించి జిఒ 22ను రద్దు చేసి ఫీజుల నిర్ణయంపై పున:పరిశీలన చేయాలని ఎయు ఏరియా ఎఫిలియేటెడ్ కాలేజెస్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు, కె.కోటపాడు అయ్యన్న డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ డాక్టరు ఖాశీం కోరారు. ప్రైవేట్ డిగ్రీ కాలేజీ మేనేజ్మెంట్స్ అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం ఇక్కడి అయ్యన్న డిగ్రీ కళాశాల యాజమాన్యం సంపూర్ణ బంద్ పాటించారు. ఈ సందర్భంగా డాక్టరు ఖాశీం మాట్లాడుతూ దేవరాపల్లి, చోడవరం మండలల్లో కూడా ప్రైవేట్ కాలేజీస్ బంద్ విజయవంతమైందని తెలిపారు. ఈ బంద్‌లో అధ్యాపకులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఉపాధి కూలీలకు పే స్లిప్పులు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. మండలంలోని వంగలి పంచాయతీలో చెరువు పనులను శుక్రవారం ఆమె పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. గతంలో పే స్లిప్పులు వారనికొకసారి ఇచ్చేవారని, ఇప్పుడు ఇవ్వలేదని కూలీలు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పే స్లిప్పులు ఇవ్వకుంటే కూలీలకు రోజువారీ గిట్టుబాటు ధర తెలియదన్నారు. ఉపాధి కూలీలకు వేసవి అలవెన్సులు ఇవ్వాలని, పని వద్ద టెంట్ ఏర్పాటు చేయాలని, కూలీలకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లుకు అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ప్రతి ఉపాధి కూలీకి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నేతలు యర్రా సోంబాబు, ఊడి రాము నాయుడు, వంకర కష్ణ పాల్గొన్నారు.

గ్రోయిన్ల మరమ్మతులు చేపట్టరూ..

ప్రజాశక్తి- అనకాపల్లి : నియోజకవర్గంలోని తుమ్మపాల, ఉగ్గినపాలెం, తగరంపూడి గ్రోయిన్లను మరమ్మతులు చేయకపోతే పంటలు ఎలా పండుతాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్ వైఫల్యం వల్లే పంటలకు నీరు అందలేదన్నారు. గ్రోయిన్లు మరమ్మత్తులపై జిల్లా కలెక్టర్ స్పందించాలని, లేకుంటే రైతులలో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. టీడీపి హయంలో ప్రతి ఏడాది గ్రోయిన్లను, ఆయకట్టలను మరమ్మతులు చేసేవారమని తెలిపారు. వైసిపి పాలనలో కౌలు రైతుల ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇటీవల కశింకోటలో కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటే ఇప్పటికీ అధికారులు వారి కుటుంబాన్ని ఆదుకొలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి బాబీ, కోట్ని సురేశ్, కోడి నాగేశ్వర రావు, వేగి కృష్ణ, ముచ్చి కొండల రావు, కర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అగ్రికల్చర్ ఆఫీసర్ పి రంగాచారి అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ విత్తనాలకు, ఎరువులకు రైతుల ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ వ్యవసాయ అధికారి ఏమ్ రామారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మొల్లి అప్పారావు, మండల వ్యవసాయ అధికారి పి రంగాచారి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్ధ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. స్థానిక నర్సింగరావుపేట ఎంవీఆర్ కార్యాలయం వద్ద నుండి శుక్రవారం వెంకటేశ్వరరావు తనయుడు ముత్యాల సతీష్ పచ్చ జెండా ఊపి యాత్ర బస్సులను ప్రారంభించారు. కోటపాడు మండలం సింగన్నదొరపాలెం గ్రామపంచాయతీకి చెందిన భక్తులు బయలుదేరి సింహాచలం, అన్నవరం, కనకమాలక్ష్మి ఆలయాల దర్శనానికి వెళ్లారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం ఆల్పా హారం, మధ్యాహ్నం భోజనం, రాత్రికి ఆల్పారం కల్పించారు. ఎక్కడికక్కడ తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మహిళలు

ఎఎంసి కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక విజయరామరాజుపేటలోని ఏఎంసీ కాలనీ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొని లబ్ధిదారులకు పథకాలకు సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసి కాలనీ ప్రజలు మంత్రితో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జే.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్. పథకం కింద సుమారు 192 మందికి జి ప్లస్ టు ఇళ్లను నిర్మించి ఇచ్చారని, ప్రస్తుతం ఆ కాలనీలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, కుళాయిలు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని విన్నవించారు. ప్రస్తుతం కాలనీలో నివసిస్తున్న వారి వద్ద ఒరిజినల్ పట్టాలు లేకపోవడం వల్ల ఎటువంటి చర్యలు చేపట్ట లేకపోతున్నామని చెప్పారు. గృహాల మంజూరు సమయంలో ఇచ్చిన జాబితాను సేకరించి దాని ప్రకారం వన్ టైం సెటిల్మెంట్ చేయాలని మంత్రి అమర్నాథ్ అధికారులను ఆదేశించారు. 20 ఏళ్ల నుంచి మహారాష్ట్రకు చెందిన సుమారు 400 మంది ఈ ప్రాంతంలో నివసిస్తున్నామని, తమను బొందిలి కులంలో చేర్చమని చాలా కాలంగా అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదని తెలిపారు. వెంటనే ఎమ్మార్వోని పిలిపించి ఈ అంశాన్ని జగనన్న సురక్షలో చేర్చి వారికి అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎంపీపీ సూరిబాబు, మల్ల బుల్లి బాబు, డాక్టర్ రామ్మూర్తి, పార్టీ నాయకులు రత్నకుమారి, నడిశెట్టి మధు, పలక రవి, మాజీ కౌన్సిలర్లు కొణతాల మురళీకృష్ణ, కొండూరు రవీంద్ర, పెతకం శెట్టి జగన్మోహన్, లట్టల మురళి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

తాడి గ్రామం తరలింపునకు భూమి సిద్ధం చేయాలి

- తహశీల్దారుకు ఎమ్మెల్యే అదీప్ రాజ్ ఆదేశం

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని తాడి గ్రామాన్ని తరలించడానికి భూమి సిద్ధం చేయాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తహశీల్దారు కనకారావును ఆదేశించారు. శుక్రవారం ఆయన తనక్యాంప్ కార్యాలయంలో తాడి గ్రామం తరలింపు విషయమై రెవిన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. తాడి గ్రామం తరలింపునకు ప్రభుత్వం అన్ని కార్యక్రమాలు సిద్ధంచేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. జంగిల్ క్లియరెన్స్ చేసి, సర్వే పనులు పూర్తి చేసి, ఒక్కొక్క కుటుంబానికి అయిదు సెంట్లు చొప్పున ప్లాట్లుగా విభజించి లే అవుట్ తయారు చేయాలని కోరారు. అతిత్వరలోనే తాడి తరలింపునకు అవసరమయ్యే నిధులు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎం కార్యదర్శి ధనుంజయరెడ్డి తో ఈ విషయం చర్చించినట్లు, అతి త్వరలోనే అధికారికంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు ఇస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ దలాయి నదియా, మాజీ సర్పంచ్ నీలకంఠరావు, సూరిబాబు, రమణ, గోవిందరాజు పాల్గొన్నారు.

క్వారీ లారీల వేగానికి అడ్డుకట్ట వేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలో క్వారీ లారీల స్పీడుకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టపగలు అతి వేగంతో క్వారీ లారీల స్పీడుకు ప్రజలు, ఉదయం స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు భయభ్రాంతులు గురవుతున్నారని తెలిపారు. వాటి స్పీడు వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. సిఐ స్పందించి లారీ డ్రైవర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి వారికి కౌన్సిలింగ్ ఇస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బొట్టా చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు, ముగడా అప్పారావు ఉన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక వేల్పుల వీధి పార్టీ కార్యకర్తలతో శుక్రవారం కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమన్నారు. కార్యకర్తలు, నాయకులు ఇప్పటినుంచి ఎన్నికల ప్రక్రియకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో 83వ వార్డు ఇంచార్జీ బొద్దపు ప్రసాద్, గుండా సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయ ప్రాంగణంలో వాహన పార్కింగ్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం వాహన పార్కింగ్‌గా మారింది. దీంతో కార్యాలయానికి వచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చోడవరం రిజిస్ట్రార్ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు పనులపై వచ్చేవారు తమ కార్లను తీసుకొచ్చి కార్యాలయం వద్ద ఉంచుతున్నారు. చోడవరంలో వివిధ పనుల మీద వచ్చేవారు పార్కింగ్కు సులువుగా ఉంటుందని వాహనాలు నిలిపివేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఎన్ని మార్లు చెప్పిన పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. వర్షం కురిస్తే కార్యాలయానికి వాహనాల మధ్య వెళ్లడం ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు అంటున్నారు.

వైసిపి నేత అనుచిత వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి వడ్డాది : జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై వైసీపీ నేతలు, వాలంటీర్లు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం వడ్డాది జంక్షన్‌లో జనసేన, బిజెపి నాయకులు నిరసన చేపట్టారు. పెద్దేరు వంతెన నుండి వడ్డాది నాలుగు రోడ్ల కూడలి వరకు ప్లకార్డులతో ర్యాలీగా తరలివచ్చి అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైసిపి ప్రభుత్వానికి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జనసేన నేతలు నానాజీ డీవస్ నాయుడు, ఎడ్ల రామ్మూర్తి, బీజేపీ నాయకులు సీత నాగరాజు, దూది రాజేష్ తదితరులు పాల్గొన్నారు

జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ధ్రువపత్రాలు



ధ్రువపత్రాలు అందజేస్తున్న కశింకోట ఎంపిపి, జెడ్‌పిటిసి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు గ్రామస్థాయిలో ఉచితంగా ఇచ్చేలా జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని గొలగాం సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్ శలపురెడ్డి నాగ నరసింహారావుతో పలు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కెవి నరసింహారావు, వైసిపి నాయకులు పసుపులేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని బయ్యవరం, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్‌పిపి కలగా లక్ష్మి చేతుల మీదుగా పలు ధ్రువ పత్రా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, గ్రామ సర్పంచ్‌లు కలగా గున్నయ నాయుడు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, శ్యామ్ సన్, ఎమ్‌పిడిఒ రవికుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మర్రివలస, కొరువాడ గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పిటిసి ఈర్లే అనురాధ మాట్లాడారు. మర్రివలసలో తహశీల్దారు రమేష్ బాబు, కొరువాడలో ఎంపిడీవో శశిదేవి ఆధ్వర్యాన జరిగాయి. మండల స్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని గున్నెంపూడి, చింతపాక సచివాలయాలలో జరిగిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొని మాట్లాడారు. జడ్పిటిసి దొండా రాంబాబు, వైసీపీ నేత దాకవరపు నాగేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణ రాజు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సర్పంచులు ముచ్చకర్ల అప్పారావు, గోలజానా శ్రీను పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొని మాట్లాడారు. జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపిడిఒ డేవిడ్ రాజుతో కలిసి 500 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. చోద్యం సచివాలయంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంధల రాజు, ఇన్‌చార్జ్ తహశీల్దార్ ఆనందరావులు 300 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. వైసిపి నాయకులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు, చీడిగుమ్మల సర్పంచ్ కాపారపు చిన్నబ్బాయి పాల్గొన్నారు.

నక్కపల్లి : చినదొడ్డిగల్లు, పెద్దతీనార్ల గ్రామాల్లో లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేద్కర్ ,ఈఓపిఆర్డి వెంకటనారాయణ, డీటీ నీరజ ,సర్పంచ్‌లు చంద్రరావు, శ్రీనివాసరావు, ఎంపిటీసీ సభ్యులు నాగేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

కోటవురట్ల : జగనన్న సురక్షను సద్వినియోగించు కోవాలని మండల ప్రత్యేక అధికారి ఉదయశ్రీ కోరారు. తంగేడు గ్రామంలో 520, పికే పల్లిలో 452 వివిధ రకాల ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకున్నారు. వైస్ ఎంపీపీ దత్తుడు రాజు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, తహసిల్దార్ జానకమ్మ, డిప్యూటీ తహసిల్దార్ సోమశేఖర్, ఈవోపీఆర్డీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీతమ్మధార : అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. జివిఎంసి 47వ వార్డు రాజీ ఎస్టేట్, న్యూ హాస్పిటల్ డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. పలువురికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో 47వ వార్డు కార్పొరేటర్ కంటి పాము కామేశ్వరి, జోనల్ కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, తహశీల్దార్ జయ, ఇఇ శ్రీనివాస్,ఎఇ మోహన్, వైసిపి నేతలు వసంతల అప్పారావు, సుకుమార్ పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని మత్స్యకారులకు పార్మా సిటీలోని కంపెనీల్లో నాలుగు వారాల్లోగా ఉద్యోగాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందని, దానిని అమలు చేయాలని శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌కు ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు విన్నవించారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసిన సుజాత ముత్యాలు హైకోర్టు ఆర్డర్ కాపీలు సమర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి మత్స్యకారులకు ఉపాధి కల్పించడానికి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైలా వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, వైసిపి నాయకులు బొంది అచ్చిబాబు, మైలపల్లి అప్పన్న, డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, బోద్దపు చిన్నారావు, వెన్నెల సన్యాసిరావు, భాస్కర్ రావు, కూండ్రపు కృష్ణంనాయుడు, మత్స్యకార నాయకులు దూడ నూకాలు, చింతకాయల దేముడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కోర్టు ఆర్డర్ అందజేస్తున్న సుజాత ముత్యాలు

సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో కబడ్డీ కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కబడ్డీ కోర్టును శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 12 క్రీడాంశాలలో జాతీయ స్థాయి విజయాలు తమ విద్యా సంస్థ సాధిస్తుందని చెప్పారు. క్రీడలు కేవలం శరీరం దారుఢ్యం కోసమే కాకుండా మానసిక ఆనారోగ్యమైన నిస్సత్తువ, నిర్లిప్తం, ఏ పనిచేయాలన్నా ఉత్సాహం లేకపోవడం వంటి వాటికి పరిష్కారం చెబుతాయని తెలిపారు. పుస్తకం చదివినప్పుడల్లా నూతనోత్తేజం నిత్యస్ఫూర్తిని నింపుకుంటారని చెప్పారు. విశాఖ జిల్లా కబడ్డీ సంఘం జాయింట్ సెక్రెటరీ కె. లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో జాతీయ స్థాయి క్రీడాకారుల మధ్యలో మ్యాచ్‌లు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈఓ. కె. నిశంత్, పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి. మధుబాబు, రిఫరీ కె.భూలోక, కబాడీ సంఘం వైస్ ప్రెసిడెంట్ కె నూకరాజు, స్కోరర్ గంగరాజు, కోచ్‌లు, మనీష్, రామారావు, లోహిత్, రాజేష్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి చొరవతో విద్యార్థినులకు సైకిళ్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీకి సిద్ధం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఆడపిల్లలకు సైకిళ్లు అందజేయాలని ఆలోచనతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదించారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తే బాగుంటుందని చెప్పిన వెంటనే సుమారు 2500 సైకిళ్లను 'అరబిందో' సిద్ధం చేసిందని మంత్రి తెలిపారు. అత్యంత నాణ్యమైన, సురక్షితమైన సైకిళ్లను జీవీఎంసీ హైస్కూల్లో ఉంచామని, ఈ సైకిళ్లను త్వరలోనే అందజేయనున్నట్టు తెలిపారు.

17న మహా ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : సహకార సంఘాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 17వ తేదీన విజయవాడలో జరిగే సహకార సంఘాల సిబ్బంది మహా ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ నేతలు విలువనిచ్చారు. మండలంలోని నాగులపల్లి సహకార సంఘంలో యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి. నాగభూషణం, జనరల్ సెక్రటరీ ఆర్. శివరామకృష్ణ, అసోసియేట్ అధ్యక్షులు మల్ల స్వామి, రాష్ట్ర యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రొట్టెల వెంకటరావు, జిల్లా ట్రెజరర్ జ్ఞానేశ్వరరావు శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ సహకార సంఘాల షేర్లు ప్రైవేటు వ్యక్తులకు అమ్మే ఆలోచన విరమించుకోవాలని, 1964 సహకార సంఘాలు చట్టానికి చేసిన సవరణను రద్దు చేయాలని, ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 36 ప్రకారం సహకార సంఘాల సిబ్బందికి పే రివిజన్ చేయాలని, జీవో ప్రకారం ఏరియర్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత జాయిన్ అయిన సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో సహకార సంఘాల షేరు ధనం వడ్డీ చెల్లించాలని, సభ్యులు సక్రమంగా కట్టిన వ్యవసాయ రుణాలకు వడ్డీ రాయితీలు వెంటనే విడుదల చేయాలనే పలు డిమాండ్ల సాధనకై ఈ మహా ధర్నా జరగనుందని తెలిపారు.



డిమాండ్ల పత్రం చూపుతున్న నేతలు

నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు వినతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ 5వ వార్డులో వార్డు కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, మున్సిపల్ చైర్పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి శుక్రవారం పాల్గొన్నారు. నర్సీపట్నంలో ట్రాఫిక్ సమస్యలతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, దీని దృష్ట్యా ప్రధాన రహదారి విస్తరించాలని స్థానికులు కోరారు. కొందరు భవన యజమానులు, వ్యాపారులు రోడ్డు విస్తరణ పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, కోర్టుకు వెళ్లారని, హైకోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని, అయితే ఎట్టి పరిస్థితులలోను రోడ్డు విస్తరణ జరిగి తీరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వార్డులోని చిట్టి మోజు వీర్రాజు, సూర్యకాంతం వృద్ధ దంపతులు తమను కొడుకులు చూడటం లేదని ఎమ్మెల్యేకు తెలిపారు. 3వ సచివాలయ పరిధిలో 4,5 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆర్డీవో జయరామ్ లబ్దిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహసిల్దార్ అన్నాజీరావు, ఎస్సై గోవిందరావు, వైసిపి నాయకులు యాదగిరి శేషు, టౌన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏకాశివ , ముస్లిం సంచార జాతుల స్టేట్ డైరెక్టర్ చోటి ఘంటా లలిత, వరలక్ష్మి, కో ఆప్షన్ కౌన్సిలర్ ఎండి భాష , షేక్ రోజా, శాలివాహన కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ అర్జున పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యలు చెపుతున్న స్థానికులు

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఆరిలోవ రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలవు మణికుమారి, మండల ప్రధాన కార్యదర్శి పత్తి రమణ, యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న పిల్లలు, నేతలు

జనన ధ్రువపత్రాలు ఇవ్వరూ..

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం గిరిజన గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందిస్తున్న 11 రకాల ధృవపత్రాలలో భాగంగా గిరిజన పిల్లలకు నోటరీ నిబంధన లేకుండా జనన ధృవీకరణ పత్రాలు అందించాలని గిరిజన సంఘం నాయకులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పితిరిగెడ్డలో శుక్రవారం పిల్లలతో కలిసి ఆందోళన చేపట్టారు. చదువులకు, రేషన్‌కు గిరిజనుల ఇబ్బందుల దృష్ట్యా అనకాపల్లి జిల్లా కలెక్టర్ స్పందించి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థులు పాల్గొన్నారు.



వసతిగృహంలో చేపడుతున్న పిచికారి

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-కోటవురట్ల: డెంగీ నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి గోవిందరావు తెలిపారు. మండలంలోని కస్తూరిబా పాఠశాల, బాలికల వసతిగృహం, ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో శుక్రవారం దోమల నివారణకు పిచికారి చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సరితా దేవి, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ గోపీనాథ్, బాలికల హాస్టల్ వార్డెన్ రాజ్యలక్ష్మి వైద్య సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక



దివ్య



లక్ష్మణ్



ధనలక్ష్మి



పూజ్య

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని ఎంఇఒ తలుపులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాకిరెడ్డి దివ్య, మాకిరెడ్డి లక్ష్మణ్, మద్దు ధనలక్ష్మీ రోలుగుంట గ్రామానికి చెందిన వారు కాగా, అనిమిరెడ్డి పూజ్య బుచ్చింపేట జిల్లా పరిషత్ పాఠశాలలో చదివాని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

కనోసా విద్యార్థి ఎంపిక

పాయకరావుపేట:పాయకరావుపేట కనోసా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థి ట్రిబుల్ ఐటీ కి ఎంపిక అయ్యాడు. ప్రణవదీప్ ప్రసాద్ 577 మార్కులతో పదవ తరగతిలో ప్రతిభ చాటాడు. ట్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు కనోసా ప్రిన్సిపాల్ సంతాన తెలిపారు. శ్రీకాకుళంలో ట్రిబుల్ ఐటీ కళాశాలలో ప్రవేశానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్ అభినందించారు.



అభినందిస్తున్న ప్రిన్సిపల్



అభినందిస్తున్న హెచ్ఎం

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక డిపిఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కశింకోట చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ఎంఆర్‌వి.అప్పారావు శుక్రవారం తెలిపారు. ఇద్దరు విద్యార్థులు కొవ్వాడ దోకుల మెక్షత బిందు న్యూజివీడుకు, మరో ఇద్దరు విద్యార్థులు కరణం రాకేష్, కౌసర్ సుల్తానా శ్రీకాకుళం ఐఐటి క్యాంపస్‌కు ఎంపికైనట్లు వెల్లడించారు. వీరికి ప్రసాద్, ఏ.రవి, పివిఆర్.ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

కె.కోటపాడు : ట్రిపుల్ ఐటికి మండలంనుండి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. చౌడువాడ జడ్పీ హైస్కూల్లో చదువుతున్న ఆడారు కుసుమకు పదవ తరగతిలో 560 మార్కులు సాధించడంతో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు పొందారు. పాత వలస హైస్కూల్ నుండి ఇద్దరు విద్యార్థులు, కొరువాడ హైస్కూల్ నుండి ఒక విద్యార్థి ఎంపికైనట్లు ఎంఈఓ వెల్లడించారు. ట్రిబుల్ ఐటికి ఎంపికైన విద్యార్థిని చౌడువాడ హైస్కూల్ హెచ్ఎం ఈర్లే అప్పారావు అభినందించారు.



రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చీడికాడ:ఖండివరం పశు వైద్య శాలను మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా చిట్టి నాయుడు మాట్లాడుతూ, పశు వైద్యశాల పరిధిలోని గ్రామాలలో పాడి రైతులతో పశు విజ్ఞాన బడి నిర్వహించి, లింగ నిర్ధారిత వీర్యం, ఉచిత గర్భధారణ ఇంజక్షన్లు, సంపూర్ణ మిశ్రమ దాణా, సబ్సిడీపై కాకి జొన్న, జొన్న, అలచంద గడ్డి విత్తనాలపై పాడి రైతులకు తెలియజేయాలని పశు వైద్యాధికారి గణేష్‌ను ఆదేశించారు. పశు వైద్య శాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలోని పశు వైద్య సిబ్బంది పనితీరును ఆయా గ్రామాలను సందర్శించి ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పశువైద్య శాల పరిధిలో బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

పట్టాలివ్వాలని ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:సాగు చేసి వ్యవసాయం చేసుకుంటూ బతుకున్న రెల్లి, దళితుల కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం వద్ద జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ, గొలుగొండ మండలం గొలుగొండ గ్రామ పంచాయతీకి చెందిన అణగారిన రెల్లి జాతికి చెందిన 42 మందికి ఒక్కొక్కరికి ఒక ఎకరం భూమి చొప్పున వారికి 1989లో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అప్పటి నుండి సుమారు 34 సంవత్సరాల నుండి ఆ భూమి మీదనే ఆధారపడి జీవనం సాగిస్తు న్నారన్నారు.స్థానిక వైసిపి నాయకులు, తహశీల్దార్ సాగుదారులకు తెలియజేయకుండా జగనన్న గృహాలను కేటాయించారన్నారు. తక్షణమే పట్టాపాసు పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కోన నారాయణరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, గొలుగొండ మండల నాయకులు వాసం వెంకటేష్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నేతలు



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎపిఎం

పలుచోట్ల మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-రోలుగుంట:గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో భాగంగా వ్యవసాయ సహాయ సంఘం సభ్యులతో లక్ష పండ్ల మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో 4095 మొక్కలు పంపిణీ చేసినట్లు ఏపిఎం సాధన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న 1280 మంది డ్వాక్రా సభ్యులకు 4095 మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

కొబ్బరి, మామిడి, జీడిమామిడి, జామ, బత్తాయి, సపోట, నిమ్మ, శీతాఫలం, చింత మొక్కలను స్థానిక జెడ్పీటీసీ పోతల శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు మద్దు అప్పలనాయుడు, వెలుగు సిసిలు పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దత్తుడు రాజు మాట్లాడుతూ, పర్యావరణం పరిరక్షణ కు ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వెలుగు అధికారి రమణకుమారి మాట్లాడుతూ, 4241 మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు శ్రీనివాసరావు, ఏవో చంద్రశేఖర్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కోటవురట్ల:అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని చేపడుతున్న దీక్ష శుక్రవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా గిరిజనులు, సిపిఎం నాయకులు దీక్ష శిబిరం వద్ద మెడకు ఉరితాళ్ళు బిగించుకొని నిరసన చేపట్టారు, ఈ కార్యక్రమంలో డేవిడ్ రాజు, సూరిబాబు, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఉరితాడుతో వేలాడుతూ నిరసన చేపడుతున్న గిరిజనులు

ఉపాధ్యాయులు, హెచ్ఎంలు.. ప్రశస్త యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

విభిన్న ప్రతిభావంత బాలల గుర్తింపునకు అవకాశం

ప్రజాశక్తి-రావికమతం:విభిన్న ప్రతిభావంత బాలల గుర్తింపునకు ప్రశస్త యాప్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్ర శిక్ష, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ అందుబాటులోకి తీసుకు వచ్చిందని మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు తెలిపారు. మేడివాడ, మట్టవానిపాలెం పాఠశాలలో ఉపాధ్యాయులతో ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్‌ను శుక్రవారం చేయించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ 21 రకాల వైకల్యాలు కలిగిన పిల్లలను గుర్తించి 64 ప్రశ్నలను ఈ యాప్‌లో పొందుపరచడం జరుగు తుందన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు ప్లే స్టోర్ ద్వారా ప్రశస్త యాప్‌ను డౌన్లోడు చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందులో పొందుపరిచిన పిల్లలకు తగిన వైద్య సేవలు, సహాయక చర్యలు, పలు సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మేడివాడ, చినపాచిల, మట్టవాని పాలెం, టి.అర్జాపురం పాఠశాలల్లో 58 మంది ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ సర్వే ఈనెల 28 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.



డౌన్‌లోడ్ చేసిన యాప్‌ను చూపుతున్న ఉపాధ్యాయులు



అడ్డుకుంటున్న గ్రామస్తులు

దేవాలయ నిర్మాణ పనులు అడ్డగింత

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ఏఎల్‌పురం మేజర్ పంచాయతీ బోయినవారి చెరువులో జరుగుతున్న వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను శుక్రవారం దేవాదాయశాఖ, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఇఒ పైల శేఖర్‌బాబు మాట్లాడుతూ, చెరువు గర్భంలో దేవాలయ నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో కూలి పోయి భక్తులకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, దీంతో రెవెన్యూ అదికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు శుక్రవారం అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. దేవాలయం నిర్మాణాన్ని అడ్డుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నించడంతో అక్కడి నుంచి అధికారులు వెళ్లి పోయారు.



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:డిగ్రీలో బీఎస్సీ (సిబిజెడ్) కోర్సును తొలగించడంపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి పోలీస్ స్టేషన్, 5 రోడ్ల జంక్షన్, అబీద్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చారు. ఆర్డిఓ కార్యాలయం వద్ద కొద్దిసేపు నినాదాలు చేసిన అనంతరం ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన ఈ కోర్సును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్లో మెనూ తో పాటు కనీస వసతులు కల్పించలేదని ఆరోపించారు. ఏఐయస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సతీష్, నాయకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

సిపిఎం నేతల ఫిర్యాదుపై స్పందన

ప్రజాశక్తి -కొత్తకోట:జగనన్న సురక్ష కార్యక్రమం లో జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసిన ఆదివాసీలకు నోటరీ సమర్పించాలంటూ సచివాలయ సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారన్న ఫిర్యాదుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, నర్సీపట్నం ఆర్‌డివో స్పందించారని సిపిఎం జిల్లా కార్య వర్గ సభ్యులు, గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు తెలిపారు.శుక్రవారం స్థానిక విలేకరులకు ఆయన తెలిపిన వివరాల మేరకు రావికమతం మండలం చీమలపాడు శివారు అజెయ్‌పురం, పెదగరువు తదితర గ్రామాలలో సూమారు 14 మంది ఆదివాసీ గిరిజన విద్యార్థులు జనన ధ్రువ పత్రాలు కోసం జగనన్న సురక్ష కార్యక్రమం లో దరఖాస్తు చేసారని చెప్పారు. ధ్రువ పత్రాల జారీకి లాయర్ నోటరీ పెట్టాలంటూ సచివాలయ ఇబ్బంది పెడుతున్నారని, అల్లూరి జిల్లాలో గిరిజనులకు ఎటువంటి నోటరీలు లేకుండానే ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నారని తెలిపారు. నాన్ షెడ్యూల్ ప్రాంత గిరిజనులకు అదే పద్ధతి వర్తింపజేయాలని డిమాండ్ చేశామన్నారు. అజయపురం, పెద్దగరువు గ్రామాల్లో 14 మంది పిల్లలకు జనన ధ్రువ పత్రాలు లేక రేషన్ కార్డులలో పేర్లు నమోదు కాలేదని, రేషన్ కూడా ఇవ్వలేదన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రావికమతం తహసీల్దార్ మహేశ్వరరావు ధ్రువ పత్రాల జారీకి చర్యలు చేపట్టారని పేర్కొన్నారు.

పేరుకే అప్‌గ్రేడ్.. అందని వైద్య సేవలు

-మరమ్మతుకు నోచని ఇసిజి యంత్రం
-రేడియోగ్రాఫర్ లేక నిరుపయోగంగా ఎక్స్ రే రూమ్
- అవస్థలు పడుతున్న రోగులు
-ఇదీ నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి దుస్థితి



ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఇందుకు తగిన వైద్య పరికరాలు లేకపోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు అవస్థలు పడుతున్నారు. రేడియోగ్రాఫర్ (ఎక్స్ రే తీసే వ్యక్తి) లేక పోవడంతో గత ఎనిమిది రోజుల నుండి ఎక్స్ రే రూమ్ మూతపడడంతో ఎక్సరేలు తీయడం లేదు. దీంతో, ఎక్స్ రే అవసరం అగు రోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడ పని చేసిన రేడియో గ్రాఫర్ బదిలీ కావడంతో ఎలమంచిలి నుండి కొత్తగా వచ్చిన రేడియోగ్రాఫర్ జూన్ నెల 23 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు విధులు నిర్వహించి, 8వ తేదీ నుండి రాక పోవడంతో ఎక్స్ రే రూమ్ మూతపడింది. ఎక్స్ రే తీసేవారు లేక పోవడంతో వైద్యం కోసం వచ్చిన రోగులకు ఎక్స్ రే అవసరం పడితే చేసేదేమీ లేక తుని, అనకాపల్లి ఆసుపత్రులకు వైద్యులు రిఫర్ చేస్తున్నారు. దీంతో, ఎక్స్ రే అవసరమగు రోగులు పడరాని పాట్లు పడుతున్నారు.



తెరుచుకోని ఎక్స్ రే గది

కొత్త ఎక్స్ రే మిషన్ ఏర్పాటు చేయాలి

ఎక్స్ రే తీసే మిషన్ కూడా అంతంత మాత్రంగానే పనిచేస్తుంది. గతంలో మిషన్ మొరాయిస్తే మరమ్మత్తు పనులు చేపట్టి వాడుకలోకి తీసుకు వచ్చారు. మిషన్ ఎన్ని రోజులు పని చేస్తుందో ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఖచ్చితంగా ఎక్స్ రే తీసే మిషన్ కూడా కొత్తది ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈసిజి సేవలు అందించాలి

ఈసిజి మిషన్ గత 8 నెలల క్రితమే మరమ్మతుకు గురైంది. నిధుల సమస్య కారణంగా కొత్త మిషన్ కొనుగోలు చేయలేదు. ఈసీజీ మిషన్ ఊసే లేకుండా పోయింది. రోగులకు ఈసీజీ సేవలను వైద్యులు అందించలేక పోతున్నారు. ఈసి జి మిషన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రోగులు డిమాండ్ చేశారు .

పెరిగిన రోగుల తాకిడి

గతంతో పోల్చుకుంటే నక్కపల్లి ఆసుపత్రికి రోగులు తాకిడి విపరీతంగా పెరిగింది. గతంలో రోజుకు 200 వరకు ఓపి చూస్తే, ఇప్పుడు 300 నుండి 350 వరకు ఓపి పెరిగింది. నక్కపల్లి మండలంతో పాటు ఎస్.రాయవరం మండలం నుండి కూడా రోగులు వైద్యం కోసం నక్కపల్లి ఆసుపత్రికి వస్తున్నారు. దీంతో, ఆసుపత్రి ప్రతిరోజు రోగుల తాకిడితో కిటలాడుతుంది. పాయకరావుపేట, ఎస్ రాయవరం మండలం పెనుగొల్లు ధర్మవరం జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు నక్కపల్లి ఆసుపత్రిలో సరైన వైద్య పరికరాలు ,అందుబాటులో రక్తం లేకపోవడంతో వైద్యులు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి లేదా విశాఖపట్నం ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అక్కడికి వెళ్లే లోపు క్షతగాత్రులు మార్గ మధ్యలోనే మృత్యువాత పడుతున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య పరికరాలు,సౌకర్యాలు కల్పించి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అదేవిధంగా జనరల్ ఫిజీషియన్ సర్జన్‌ను నియమించి ఆసుపత్రికి వచ్చే రోగులకు, క్షతగాత్రులకు పూర్తిస్థాయిలో వైద్యం అందించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



క్యూలో నిలుచున్న రోగులు


ఎక్స్ రే సేవలు ప్రారంభించాలి



ఆసుపత్రికి వైద్యం కోసం వస్తే వైద్యులు పరీక్షించి ఎక్స్ రే వాసారు. రేడియోగ్రాఫర్ లేకపోవడంతో ఆసుపత్రిలో ఎక్స్ రే తీయలేదు. ఎక్స్ రే కోసం తుని లేదా అనకాపల్లి వెళ్ళ వుంటున్నారు. చాలా ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది .వెంటనే ఎక్స్ రే సేవలను ప్రారంభించాలి .

ఎల్ నూకరత్నం,

డిసిహెచ్‌కు తెలియజేశాం



రేడియోగ్రాఫర్ లేకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులను డిసిహెచ్‌కు తెలియజేశాం. ఇటీవల ఇక్కడకు బదిలీపై వచ్చిన రేడియోగ్రాఫర్ ఈనెల 7 వ తేదీ వరకు విధులు నిర్వహించారని, 8 వ తేదీ నుండి రాలేదని, సెలవు కూడా మంజూరు చేయలేదని, ఈ విషయాన్ని డిసిహెచ్‌కు తెలియజేశాం.ప్రస్తుతం ఎక్స్ రే అవసరమగు రోగులను తుని, అనకాపల్లి ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నాం.

బి.ఈశ్వర్ ప్రసాద్ ,
ఆసుపత్రి సూపరింటెండెంట్



రాజారావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు, నాయకులు

చిరస్మరణీయుడు రాజారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో:ప్రజారోగ్య శాఖ సాంకేతిక విభాగం విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరుగా పనిచేసిన కోరాబు రాజారావు గిరిజన మారుమూల ప్రాంతంలో జన్మించి ఇంజినీరుగా ఎదగడం గొప్ప విషయమని ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కొనియాడారు. విశాఖ నగరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రాజారావు సంస్మరణ సభలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత నెల 30న అనారోగ్య కారణంతో మెడికవర్ ఆసుపత్రిలో మృతిచెందిన కోరాబు రాజారావు గిరిజన ప్రాంత మణిహారమని అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా చింతపల్లి మండలం అంతర్ల గిరిజన గ్రామంలో జన్మించి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చదువుకొని అసిస్టెంట్ ఇంజినీరుగా మున్సిపాల్టీలో చేరి అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఎదిగారని రాజారావును ప్రశంసించారు. ఉన్నతంగా ఎదిగినా సేవా దృక్పథంతోనే రాజారావు విధుల్లో వ్యవహరించారన్నారు. పబ్లిక్ హెల్త్ (ఎఫ్ఎసి) విశాఖపట్నం నుంచి గణపతిరావు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా పలువురు ఇంజినీరింగ్ అధికారులు, పురపాలక సంఘాలకు చెందిన అధికారులు, జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఉక్కునగరం : వాకింగ్ గ్రౌండ్‌లో సమస్యలను పరిష్కరించి, సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని జివిఎంసి 78వ కార్పొరేటర్, సిపిఎమ్‌కు చెందిన డాక్టర్ బి.గంగారావు అన్నారు. శుక్రవారం ఉదయం అగనంపూడి చెక్‌పోస్ట్ దగ్గర వాకింగ్ గ్రౌండ్‌లో వాకర్స్‌తో సమావేశమయ్యారు వారి సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగారావు మాట్లాడుతూ, వాకింగ్ గ్రౌండ్‌లో మౌలిక వసతులు, లైటింగ్, తదితర సౌకర్యాల కల్పనకు ఉక్కు సిఎండికి లేఖ రాస్తానన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సిఐటియు స్టీల్‌జోన్ అధ్యక్షులు వైటి.దాస్, అగనంపూడి ఇన్‌ఛార్జి పి..నీలకంఠం, శశిరెడ్డి, సత్యనారాయణ, పట్టా రమేష్, అప్పలరాజు, అగనంపూడి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మడగల నర్సింగరావు, దొడ్డు దేవుడు, పూర్ణ, కోటి, చట్టి నర్సింగరావు, దయాకర్, సింహాద్రి, అంజి, నర్సింగరావు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

బొగ్గు రవాణాను అడ్డుకోవడం దుర్మార్గం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి కీలకమైన సముద్రమార్గంలో వచ్చే బొగ్గు దిగుమతిని ఆదానీ గంగవరం పోర్టు యాజమాన్యం అడ్డుకోవడం అత్యంత దుర్మార్గమని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి దాస్, యు రామస్వామి తీవ్రంగా ఖండించారు. ఉక్కునగరం స్టీల్ సిఐటియు కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో రామస్వామి మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ భూములను ఇచ్చామని, అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందాల మేరకు కార్యకలాపాలు సాగుతున్నాయన్నారు. ఇపుడు వాటికి విఘాతం కలిగించేలా పోర్టు యాజమాన్యం వ్యవహరించడం సరికాదన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్ మాట్లాడుతూ గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న పది శాతం వాటాలను వదులుకోవడం వల్లే పోర్టు యాజమాన్యం ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అంతరాయం కలిగించే ఎటువంటి చర్యలనైనా ఉపేక్షించేది లేదని, ఆదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, యు వెంకటేశ్వర్లు, మరిడయ్య, టి.పుల్లారావు, నీలకంఠం, టివికె రాజు పాల్గొన్నారు.